# అసమర్థుని జీవయాత్ర

బి.యస్.రాములు



ఆకలిగావుంది. యింకా లంచ్ అవర్ కాలేదు.

ఫైళ్ళు సర్దుతూనే వున్నా వాటి మీదికి మనసు పోవడం లేదు. ముళ్ళమీద కూర్చున్నట్టుంది. నిమిషాల ముల్లు అసలు కదులుతున్నట్టే లేదు.

ఎదుటి సీట్లో అతను ఎవరితోనో సంభాషణ సాగదీస్తున్నట్టున్నాడు. అంటే లంచ్ ఖర్చు ఆ ఆగంతకునిమీద రుద్దే వాతావరణం క్రియేట్ చేయబడుతోందన్న మాట. వెధవ ఆకలి.

అలా అనుకోవడం ఈ రోజుకు ఇదివరో సారి. ఒంటె ఒకసారి నీళ్ళు తాగితే ఆర్నెల్లి దాకా సంచీలో ఆపుకోగలదట. మనుషులు మాసానికోసారి వారానికోసారి తిన్నా ఆకలికాకుండా వుండేట్టుంటే ఎంత బాగుండేది?

అలా అయితే ఈ హోటళ్ళూ. ఈ పెళ్ళాలూ. ఏం కావాలి? అసలు అలా జరిగితే మానవ చరిత్ర ఎలా వుండేదో! అప్పుడు ఈ స్థితిలో మళ్ళీ ఏం కోరిక పుట్టేదో?

వెధవది మూడు పూటలా తిండి తినాల్సిందేనాయె! తిండి తినాలంటే ముప్పొద్దులా యిల్లూ. సంసారమూ. వంట చేయడానికి పెళ్ళామూ. పిల్లలూ. బోళ్ళూ. బోకెలు. స్టవ్వూ. గ్యాసూ. బియ్యమూ. కూరగాయలూ. పప్పులు ఉప్పులూ. పుద్దెర కాతాలు వడ్డీకి పావుసేరు ధరలూ—వెధవ తిండి యిరవై నాలుగ్గంటల్లో ఎంత కాలాన్ని మింగేస్తోందీ!

గ్యాసుకూ. చక్కెర కూ. బియ్యం కూ సైకిల్ మీద కూరగాయలకు పరుగు. బోల్లి తోమడం. యిల్లు వూడ్వడం, నీళ్ళు చేదడం, ప్లేట్లు కడగడం. వంట చేయడం -అబ్బ! ఎంత పనీ!

ఇంత చేస్తూ వెధవది యింకా ఆఫీసు డ్యూటీ చేయాలి!

మళ్ళీ ఆకలి గోకేస్తుంది. ఎవడేనా పార్టీ వస్తే బావుండు.

అసలు ఎదుటి వ్యక్తి గూర్చి పట్టించుకోవడమే తక్కువైపోయింది. (అలా పట్టించుకోనే వాడికి యిలాంటి ఆలోచనలు వస్తాయా!) ఛ ఛ యింతమందిలో కనీసం ఒక్కడు మీల్సుకు రమ్మని పిలవడు.

అసలు యింట్లో పెళ్ళానికి లేనపుడు బయటోళ్ళనంటే ఏమొస్తది? చెల్లెకు సీరియస్‌గా వుందని తెలియంగానే ఆదరబాదర బట్టలు సర్దుకొని ఉరికినంక యిక ఎవరు పట్టించుకొంటారు.

కరువులో అధికమాసం అన్నట్టు అక్కరకురాని చుట్టాలు ఎన్నడు పెండ్లికి పేరంటానికి పిలువని బాపతుగా వచ్చి మూడు రోజులు మెక్కి తినిపోయేసరికి చేసిన బియ్యం గ్లాసెన్నర మిగిలినై.

అవిగూడ తినే పాటిగాల్లే. పూర్తిగా అయిపోతే మళ్ల కొనుక్కురావల్సి వస్తదను కొని అడ్డా వుడాయించినట్టున్నాను. ఆ ఆగంతకుడూ, ఎదుటి సీట్లో అతనూ...

ఛీ ఛీ! వెధవ బుద్ధి! (ఎదుటివానిది) ఎపుడు వాడికి మందికి టోపీ వేయాలనే ధ్యాస. ఆ బతుకు అసలు బతక్కపోతేనేం (ఎవలు?)

వాడి గుణం ఇంతకుముందు తెలియందా! సంస్కారం లేని బ్రూట్! వెళ్తూ వెళ్తూ పిలవనన్నా పిలవడు. వాడి సొమ్మేం పోయిందీ కంపెనీ కోసం రమ్మని పిలిస్తే.

వెధవకి వద్దన్నా వెంట వచ్చి మెక్కి తిని తన పార్టీ వనియివ్వాల్సిన చోట హోటల్ బిల్ మనసులో వుంచుకుని అయిదు యిచ్చేట్టు యితరుల యినోకం మీద దాడి చేయడం మాత్రం తెలుసు.

ఆకలి— ఈర్ష్య— అసూయ—నీరసం — ద్వేషం— కాళ్ళు పీకడం—

"నమస్తే సార్"

వెధవ నమస్తే ఎందుకోసం పెడుతున్నారో తెలుసులే అన్నట్లుగా "నమస్తే".

"రైతు కూలీ సంగం రాష్ట్రస్థాయి రెండవ మహాసభలు కరీంనగర్‌లో జరుగుతున్నాయి. విరాళాల కోసం వచ్చాం సార్."

'ప్రతి వెధవా విరాళాల కోసం వచ్చేవాడే! మీ దుమిక్కలి ఎంతో ప్రజాసేవ చేస్తున్నట్లు పెద్ద పోజొకటి!' అని లోపల.

"హి! హి! ఉద్యోగం కదండీ, మేమేం యివ్వగలం? పెద్ద పెద్ద బిజినెస్‌వాళ్ళను. కాంట్రాక్టర్లను అడిగితే బావుంటుంది."

పైకి మాట్లాడింది మాత్రం యిది.

"వాళ్ళదేముంది సార్! మనల్ని దోచి మనకిస్తారు. మీరైతే కష్టపడి సంపాదిస్తున్న డబ్బు కాబట్టి మీరెంతిచ్చినా దాని విలువ గొప్పది సార్! ఎందుకంటే రైతు కూలీల గూర్చి మీరు ఆలోచించడం ముఖ్యం సార్. మీ ఉద్యోగ సంఘాల్లాగే వాళ్ళూ పెట్టుకోవడానికి ముందుకు వస్తున్నందుకు చేయూత నివ్వాలి మనం."

'వెధవ సభలనెవడు పెట్టుకోమన్నాడు! సభలతో ఏం సాధిద్దామనీ! ఊరుమీద పడి దోచుకోవడానికి కాకపోతే!'

"ఫస్టు దాటితే మా జేబులు ఖాళీ, మా బతుకే కాలీ! అంతే కదండీ!"

"నిజమేననుకోండి కాదనం. కాని మీరివ్వాలనుకుంటే ఎల్లైన యివ్వగలరుసార్. మీ బాబుకు జ్వరమొస్తేసైసల్లేవని మందులు కొనరా? మనసుంటే మార్గముంటది సార్."

'వెధవలు వదిలేట్టు లేరే!'

"గీతా యజ్ఞంకోసం తలా యిరవైయైదూ. సీతారామ స్వాములవారి కళ్యాణం కర్చూ ఈ నెల్లోనే మీద పడ్డాయండి. అదేదో స్విమ్మింగ్‌పూల్ కట్టించడానికి బెనిఫిట్ షో పెట్టారు. దాని బాపతుకింద ఓ యిరువైయైదు లాక్కుపోయారండీ! ఈ నెలలో లోటు బడ్జెటైంది సార్! సారీ"

"సారీ" యింగ్లీషు పదంలో కొనవాలుకమీంచి ఎంత సారీ చూపించొచ్చూ!

"మనం తినే తిండి గింజలు వాళ్ళ శ్రమ ఫలితం సార్. మీలాంటోలు మాలాంటోల్లు

లోకంలో అందరు పనిచేయడం బందు చేసినా ఏంకాదు గాని వాళ్ళు పనిచేయడం బందుజేస్తే మనం ఎంతపనిచేసినా మూతి కాడికి మూడు మెతుకు లన్నరావు. మనం కాగితాల మీద ఎంత రాసినా ఒక్క గింజను సృషించలేం సార్... వాళ్ళు ఎండనక వాననక...." వెధవలు గీతోపదేశం చేసేట్టున్నారు.

"ఆఫీసుకొచ్చేప్పుడు పైసలు వెంట ఎందుకూ తెచ్చుకుంటారు సార్. ఏమనుకోక పోతే గీ పావులా వున్నది."

పీడావిరగడైంది. ఎవడేనా పార్టీవస్తా దేమో అనిచూసే ఎదురు పార్టీ వచ్చింది.

ఆకలి దంచేస్తోంది.

లోపలనించి పిలుపు వినబడింది.

"ఏమయ్యా? యిది ఇలాగేనా ఏడ్చేది? పైనించి ఛార్జిమెమో ఇచ్చారు. శాంక్షన్ చేసేప్పుడు అన్నీసరిగ్గా వున్నాయో, లేదో చూసుకోవద్దా? మెమోకు మూడ్రోజుల్లో జవాబు రాసియ్యి. తొందరగా పంపాలి."

'దొంగవేషాలు వెయ్యకురా! జేబులు నింపుకొని శాంక్షన్ చెయ్యమని చెప్పింది నువ్వు కాదా! పైసలు నీ వంతు! మెమోలు నా వంతా' అని మనసంతా వుడుకుతోంది.

"సరే! సర్!" ముఖం జేవురించింది.

ఆ సాయంత్రం మనసేం బావులేదు. మెమో సూటిగా వుంది. జవాబు ఏ కొంచెం అజాగ్రత్తగా ఇచ్చినా మొదటికే ప్రమాదం.

బార్లో యిరవైయైదు రూపాయల చమురు వదిలేగాని మెమో మూడ్ వదల్లేదు.

'ధైర్యం వుంటే ఆ మెమోకుసూటి జవాబుగా అధికారి ఆదేశాల మేరకు శాంక్షన్ చేయబడింది అని రాయగలిగితే?

వాయమ్మో!

అలా అయితే బార్లో ఖర్చయిన పాతికా, అధికార్లు మొహమాటపెట్టి వసూలుచేసిన గీతాయజ్ఞం, సీతారామకల్యాణం, స్విమ్మింగ్ పూల్‌కిచ్చిన విరాళాలు కూడా మిగిలేవి కావు!

'వెధవ యజ్ఞాలూ, కళ్యాణాలూ స్విమ్మింగ్ పూల్సు ఎవడికొక్కావాలీ! ఉన్నొక్క పెళ్ళానికీ మంచి చీర కొందామంటే పైసలు గతిలేవుగానీ!

ధైర్యంలేని మనిషికి దండుగులెక్కువ!

నిద్దర్లో కలవరింతలు-తెల్లవారి తాగింది కక్కలింతలు, ఆఫీసుకు లీవు పంపడం. మెమో భయానికి జ్వరం అందుకున్నదన్నారు అందరు.

అన్నం తినబోతే పావులబిల్ల గొంతులో అడ్డం తట్టుకున్నట్టుంది. వారం రోజులు మరి లేవలేదు.

●

# నాటక రంగం

శ్రీ రావి వెంకటచలం అరవై ఏళ్ళ వయస్సులోకూడా, నిత్యయవ్వనులు. రచయితగా, నటుడుగా, దర్శకుడిగా ఆయన పొందని గౌరవం అందుకోలేని ఔన్నత్యం లేవు.

1917లో శ్రీకాకుళం జిల్లా కళింగ పట్నంలో జన్మించిన శ్రీ చలంగారు పన్నెండో సంవత్సరంలో "ప్లీడరు తమాషా" నాటికలో ప్లీడరు గుమాస్తా వేషానికి, భీమునిపట్నం హైస్కూల్లో ఉత్తమ నటుడిగా తొలిబహుమతిపొందారు' ఆ తర్వాత అనేక నాటక పోటీల్లో అనేక సార్లు ఉత్తమ నటుడిగా, దర్శకుడిగా, రచ

## శ్రీ రావి వెంకటచలం


యితగా బహుమతు లందుకుని, తనదంటూ ప్రత్యేకమైన బాణీ, రచనలోనూ, నాటక ప్రయోగంలో ఏర్పరచుకున్న శిల్పి శ్రీ రావి వెంకటచలంగారు.

ఉద్యోగరీత్యా జంషెడ్‌పూర్ వెళ్ళి, ప్రవాసాంధ్రుడిగా స్థిరపడకపూర్వం 'డాక్టర్ ఫాస్టస్', 'స్కిమింగ్ లెఫ్టినెంట్' లాంటి ఏకపాత్రాభినయాలు ఇంగ్లీషులోనూ, 'వర విక్రయం'లో పెళ్ళిళ్ళ పేరయ్య, 'విప్ర నారాయణ'లో శ్రీనివాసుడు, భక్తకుచేల, భక్తరామదాసు, ఖిల్జీరాజ్య పతనం, చంద్రగుప్త, చింతామణి, ఆంధ్రజ్యోతి మొదలైన నాటకాలలో వేషధారణ చేశారు. 'ఒథెల్లో' ఏకపాత్రాభినయానికి శ్రీ గోవిందరాజుల సుబ్బారావుగారు, 'చంద్రగుప్త'లో చాణక్య పాత్రధారణకు శ్రీ చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్‌గార్ల ప్రశంసలు ఆశీస్సు లందుకున్నారు శ్రీ చలం.

1960 తర్వాతనే శ్రీ చలం, పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకుని రచయితగా, నటుడుగా, దర్శకుడిగా తన బాణీని ఏర్పరచుకోగలిగారు.

"మాట తప్పకు", "విరజాజి", "ఇది నాటకం కాదు" నాటకాలు, రావి చలం గారికి విశేషమైన పేరు ప్రఖ్యాతలు తెచ్చాయి. ఆంధ్ర నాటక కళాపరిషత్, లలితకళా నికేతన్, రాజమండ్రి, విజయనగరం రాఘవ నాటకోత్సవాలు, మొదలైన చోట్ల బహుమతులు అందుకున్నారు.

1980 లో మద్రాసు కళాసాగర్‌వారు చలంగారిని ప్రముఖ రంగస్థల నటులుగా సత్కరించారు హైద్రాబాదు కళానికేతన్ వారు శ్రీ జూలూరి వీరేశ లింగం కల్చరల్ అవార్డ్-1981, ఇచ్చి



సన్మానించారు. శ్రీ చలం రంగస్థలానికి చేసిన సేవలు గుర్తించి విజయవాడ నటరాజ కళామండలి, హైదరాబాదు, ఇండియన్ నేషనల్ థియేటర్‌వారు తమ వార్షికోత్సవాల్లో సన్మానించారు.

జంషెడ్‌పూర్‌లో ప్రవాసాంధ్రులుగా ఉంటూ, కుటుంబ సభ్యులందరినీ రంగస్థలానికి పరిచయంచేసి, తెలుగు నాటక రంగానికి క్రొత్త వెలుగూ, ఊపిరి పోసిన రంగస్థల ఘనాపాటి శ్రీ చలం! ఆయన చేసిన, చేస్తున్న కృషి అనితర సాధ్యమైంది. వాచికంలో ఆయనకు దీటైన వ్యక్తి, నటుడు తెలుగు నాటక రంగంలో ఈనాడు అరుదు.

శ్రీ రావి వెంకటచలం త్రివేణీ సంగమం లాటి వ్యక్తి!

—తారకరామారావు